www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 6 మార్చి 2023 5 పశ్చిమ గోదావరి

యలమంచిలి మండలం కలగంపూడిలో జరిగిన నరసాపురం ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు కుమార్తె లక్ష్మీ సింధూజ, సూర్యసుబ్బరాజు దంపతుల వివాహ రిసెప్షన్‌కు హాజరైన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

రియల్ ఎస్టేట్ ప్లాట్లుగా మారుతున్న వరిచేలు

చేపల చెరువుల కోసం తవ్వేసిన పొలాలు

తగ్గుతున్న వరి సాగు..!

ఏటా పెరుగుతున్న ఆక్వా విస్తీర్ణం - ప్లాట్లుగా వ్యవసాయ భూములు

ప్రజాశక్తి - కాళ్ల

రోజురోజుకూ వరి సాగు విస్తీర్ణం తగ్గిపోతుంది. సాగు ఖర్చులు పెరగడం, గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు వ్యవసాయం పట్ల విముఖత చూపుతున్నారు. దీనికితోడు ఆక్వా సాగు కనక వర్షం కురిపిస్తుండడంతో మొన్నటి వరకూ పచ్చని పంట పొలాలు రొయ్యల చేపల చెరువులుగా మారుతున్నాయి. మరోవైపు రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకోవడంతో వందల ఎకరాల పంట పొలాలు ప్లాంట్లుగా మారిపోతున్నాయి. ఫలితంగా పర్యావరణం దెబ్బతినడంతోపాటు, భవిష్యత్తులో ఆహార కొరత ఎదురయ్యే ప్రమాదం పొంచి ఉంది.

వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు గతంలో ఎన్నడూ లేని విధంగా అనేక పథకాలు అమలు చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా మాటలకు క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన కుదరడం లేదు. వ్యవసాయ రంగంలో రోజురోజుకూ పెరుగుతున్న ఖర్చులు, తగ్గిన రాబడి రైతన్నలను వ్యవసాయానికి దూరం చేస్తున్నాయి.

కాళ్ల మండలంలో గత మూడేళ్లుగా సాగు విస్తీర్ణం తగ్గుతూ రావడమే దీనికి నిదర్శనం. 2021-22తో పోలిస్తే 2022-23లో ఎకరాల మేర సాగు విస్తీర్ణం తగ్గింది. వరి సాగులో పెట్టుబడి పెరగడం, ప్రకృతి వైపరీత్యాలు, ధాన్యం సేకరణలో సమస్యలు రైతులను వెంటాడుతున్నాయి. మరోవైపు ఆక్వాసాగు బాగుండడంతో రైతులు అటువైపు ఆసక్తి చూపుతున్నారు. గత రెండు దశాబ్దాల్లో వేల ఎకరాల వ్యవసాయ భూములు ఆక్వా చెరువులుగా మారిపోయాయంటే అతిశయోక్తి కాదు.

అలాగే మండలంలోని కాళ్ల, ఏలూరుపాడు, సీసలి, పెదఅమిరం, దొడ్డనపూడి, జక్కరం తదితర గ్రామాల్లో వ్యవసాయ భూములు ఆక్వా చెరువులుగా, ఫ్లాట్లుగా మారుతున్నాయి.

తగ్గుతున్న వరి విస్తీర్ణం..

2020-21లో ఖరీఫ్‌లో వరి సాగు 7,686 ఎకరాల్లో చేపడితే రబీలో 7,298 ఎకరాల చేపట్టారు. 23,262 ఎకరాల్లో చేపల సాగు చేపట్టారు. 2021-22లో ఖరీఫ్‌లో వరి సాగు 6,214 ఎకరాల్లో చేయగా, రబీలో 6,071 ఎకరాల్లో చేపట్టారు. 24,023 ఎకరాల్లో చేపల సాగు చేపట్టారు. 2022-23లో ఖరీఫ్‌లో వరి సాగు 4,712 ఎకరాల్లో చేయగా, రబీలో 150 ఎకరాల సాగు విస్తీర్ణం తగ్గింది. 2022-23 రబీలో 4,297 ఎకరాల్లో వరిసాగవుతోంది. మరో 415 ఎకరాల వరిచేలను ఆక్వా చెరువులుగా మార్పు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. దీన్ని బట్టి చూస్తే రెండేళ్లలో 2,974 ఎకరాల విస్తీర్ణం తగ్గింది.

ఇప్పటికైనా ప్రభుత్వం ఆక్వా చెరువులు, రియల్ వెంచర్లు నిరోధించకపోతే భవిష్యత్తులో ఆహార సంక్షోభం ఉత్పన్నమయ్యే ప్రమాదం పొంచి ఉంది.

ఆందోళన చేస్తున్న కార్మికులు, నాయకులు

గ్యాస్ ధరలు తగ్గించాలని ఆందోళన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని తాడేపల్లిగూడెం తాలూకా రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి చిర్లపుల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, తేతలి నాగిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రైల్వే గూడ్స్ షెడ్ వద్ద యూనియన్ అధ్యక్షులు సత్తి కోదండరామిరెడ్డి అధ్యక్షతన నిరసన ప్రదర్శన చేపట్టారు. 2014లో రూ.414 ఉన్న గ్యాస్ ధర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రస్తుతం రూ.1150కు చేరిందన్నారు. 19 కేజీల కమర్షియల్ సిలిండర్ ధర పెంచిన సుమారు రూ.2030కు చేరిందన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్.రెడ్డి, కార్తీ సుబ్బిరెడ్డి, అడపా ఆంజనేయులు, ఆకుల నారాయణ, మద్దాల పుత్రియ్య, గాది వెంకట్రావు, బుద్ధాల నాని, ధనలక్ష్మి, రమ, రైల్వే గూడ్స్ షెడ్ కార్మికులు పాల్గొన్నారు.

మృతిచెందిన విద్యార్థుల వివరాలు సేకరిస్తున్న పోలీసులు

పేరుపాలెం బీచ్‌లో విషాదం

గల్లంతై ఇద్దరు మృతి

ప్రజాశక్తి - మొగల్తూరు

పేరుపాలెం బీచ్‌లో సముద్ర స్నానాలు చేస్తూ గల్లంతైన ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. ఈ ఘటనకు సంబంధించి ఎఎస్ఐ యు.రాజేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాలకోడేరు మండలం పెన్నాడలోని భీమవరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలలో చదువుతున్న 11 మంది విద్యార్థులు ఆదివారం ఉదయం బీచ్‌కు వచ్చారు. ఈ క్రమంలో

లోహిత్ మణికంఠ(ఫైల్)

లిఖిత్‌కుమార్(ఫైల్)

అందరూ కలిసి కెపి.పాలెం సౌత్‌లోని పాండురంగ స్వామి ఆలయ సమీపంలో సముద్ర అలల్లో స్నానానికి వెళ్లారు. అలల తాకిడికి విజయనగరానికి చెందిన కందుకూరి లోహిత్ మణికంఠ(19), తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరానికి చెందిన కొమ్మునేని లిఖిత్‌కుమార్(18) గల్లంతయ్యారు. వెంటనే స్నేహితులు పోలీసులకు సమాచారం అందించారు. ఈతగాళ్లతో గాలించగా లోహిత్ మణికంఠ మృతదేహం లభ్యమైంది. అనంతరం అర్ధరాత్రి లిఖిత్ కుమార్ మృతదేహం లభ్యమైంది. ఘటనకు సంబంధించి విఆర్ఒ నారిన వెంకన్నబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎఎస్ఐ తెలిపారు.

సిఎం జగన్ ప్రజ్యావతిరేక విధానాలకు నిరసనగా

రాష్ట్రవ్యాప్త ఆందోళనలు

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్రంలో కార్మిక సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్న సిఎం జగన్ విధానాలకు నిరసనగా రానున్న బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఉమామహేశ్వరరావు ప్రసంగించారు. సిఎం జగన్ పాదయాత్ర సందర్భంగా కార్మికులకు అనేక హామీలిచ్చారని, ఆయన కోరిక తీరిన తర్వాత వాటిని విస్మరించారని విమర్శించారు. రాష్ట్రంలో లక్షలాది మంది కార్మికులకు కనీస వేతనాలు సవరించాల్సి ఉన్నప్పటికీ యాజమాన్యాలకు ఊడిగం చేసేందుకే వేతనాలు పెంచడం లేదని దుయ్యబట్టారు. అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు, వెలుగు విఒఎ, మున్సిపల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, విఆర్ఎ, గ్రామపంచాయతీ, సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు, వైద్య, ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగులు నాలుగు సంవత్సరాలుగా కళ్లు కాయలు కాసేలా వేతనాలు పెంచుతారని ఎదురుచూస్తున్నారని విమర్శించారు. కార్మికుల వేతనాలు పెంచకుండా వారిపై పని భారాన్ని పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రికి నాలుగేళ్లకాలంలో ఎన్నోసార్లు విజ్ఞాపన పత్రాలు ఇచ్చినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వం అనేకమంది చిరుద్యోగులను తొలగించేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తుందని, ప్రభుత్వం ఆ ప్రయత్నాలు ఆపకపోతే కార్మికులంతా కలిసి జగన్మోహన్‌రెడ్డినే తొలగిస్తారని హెచ్చరించారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రదర్శనలకు, ధర్నాలకు, సభలకు అనుమతులు ఇవ్వకుండా నియంతృత్వ పోకడల ద్వారా పాలన చేయాలని చూస్తే సిఎంకు తగిన గుణపాఠం చెప్పడానికి కార్మిక లోకం సిద్ధంగా ఉందన్నారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను రూ.1200 కోట్లను దారి మళ్లించి కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. ఆటో, ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లపై తీవ్రమైన వేధింపులతో ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు.



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని పరిశ్రమల్లో ఆరు నెలల కాలంలోనే ప్రమాదాలు జరిగి 15 మందికి పైగా కార్మికులు దుర్మరణం పాలయ్యారన్నారు. యాజమాన్యాల నిర్లక్ష్యం వల్లే కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని విమర్శించారు. కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్‌ల అధికారాలు తగ్గించి చేతులు కట్టేసి నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. జిల్లాలోని అనేక పరిశ్రమల్లో కార్మికులకు కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ వంటి కనీస కార్మిక చట్టాలు అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు తక్షణం జోక్యం చేసుకుని కార్మికుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు బి.సోమయ్య, కె.విజయలక్ష్మి, నారపల్లి రమణారావు, ఆర్‌విఎస్.నారాయణ, ఎస్.రాంబాబు, వివిఎన్.ప్రసాద్, ఎం.నాగమణి, ఎస్‌కె.సుభాషిణి, వి.సాయిబాబు, కెవికెఎస్.ప్రసాద్, వై.సాయికిరణ్ పాల్గొన్నారు.

సైకిల్ ర్యాలీలో మాట్లాడుతున్న జిల్లా వైద్య శాఖ అధికారి మహేశ్వరరావు

ఆరోగ్యానికి వ్యాయామం అవసరం

జిల్లా వైద్యశాఖ అధికారి మహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

ప్రస్తుత జీవన విధానంలో వ్యాయామం ఎంతో అవసరమని జిల్లా వైద్య శాఖ అధికారి మహేశ్వరరావు అన్నారు. నేషనల్ వెల్ఫేర్ కళాశాల బాలికల హాస్టల్ విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది, వాలంటీర్లు, ఆర్గనైజేషన్ సభ్యులతో ఆదివారం పట్నంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడారు. ప్రస్తుత జీవన శైలిలో శారీర శ్రమ లేకపోవడం వల్ల చిన్న వయస్సులోనే అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధికి గురవుతున్నారన్నారు. ప్రతిరోజూ సైకిల్ తొక్కడం ద్వారా ఊబకాయం, అధిక రక్తపోటు, మధుమేహం, ఒత్తిడి తగ్గించుకోవడానికి దోహదపడుతుందన్నారు. సైక్లింగ్ చేయడం వల్ల అధిక కేలరీలు ఖర్చవుతాయన్నారు. శారీరకంగా దృఢంగా ఉండడమే కాకుండా మానసిక ఒత్తిడికి గురి కాకుండా చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసి రాజు, రంగసాయి, స్వచ్ఛంద సంస్థ, డిప్యూటీ డెమో పి.అనంతలక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

అలుపెరుగని ఉద్యమ నాయకుడు సత్యనారాయణ

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రజా పోరాటాల్లో అలుపెరుగని కృషి చేసిన ఉద్యమ నాయకుడు చేబోలు సత్యనారాయణ అని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు అన్నారు. ఆదివారం అమరజీవి చేబోలు సత్యనారాయణ మూడో వర్ధంతి కార్యక్రమాన్ని పాలకోడేరు ప్రజా సంఘాల కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభకు వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషపు అశ్రియ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ అమరజీవి చేబోలు సత్యనారాయణ తన జీవితం మొత్తం ప్రజా ఉద్యమాలకే అంకితం చేశారని కొనియాడారు. పాలకోడేరు, ఉండి మండలాల్లో ఎన్నో భూ పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. పేదల పక్షాన నిలిచి వారి సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేశారన్నారు. భీమవరం, పాలకోడేరు, ఉండి, వీరవాసరం, కాళ్ల ప్రాంతాల్లో జరిగిన అనేక ప్రజా ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారన్నారు. యువజన సంఘం డివైఎఫ్ఐలో చేరి ప్రజాసేవ ప్రారంభించిన సత్యనారాయణ సిపిఎం పార్టీకి ఆకర్షితులై మండల, డివిజన్ జిల్లా కమిటీల్లో బాధ్యతలు నిర్వర్తించారన్నారు. ఇళ్ల స్థలాలు, కూలి పోరాటాలు, దళితులపై కుల వివక్ష అసమానతలపై అవిరామంగా కృషి చేశారన్నారు. చేబోలు సత్యనారాయణ జీవితం ఆదర్శనీయమన్నారు. 35 ఏళ్లకు పైగా సుదీర్ఘమైన ప్రజా జీవితంలో ఆయన గడపారని, అందుకు వారి కుటుంబ సభ్యుల ప్రోత్సాహం మరువలేనిదని కొనియాడారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషపు అశ్రియ్య మాట్లాడుతూ చేబోలు సత్యనారాయణ నిరంతరం ప్రజా సమస్యలపై నిస్వార్థంగా పోరాటం చేశారని కొనియాడారు. నమ్ముకున్న సిద్ధాంతం పట్ల అకుంఠిత దీక్షతో తుది శ్వాస వరకూ ఎర్రజెండాను విడవలేదని అన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘంలో పనిచేసిన వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి వైఎస్ఎన్.మూర్తి, మండల సహాయ కార్యదర్శి దున్న మరియమ్మ, నాయకులు దున్న శాలిని, సిహెచ్ లక్ష్మి, కుటుంబ సభ్యులు చేబోలు కనకదుర్గ, చంద్ర, చిన్నారి, మనవరాళ్లు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



వీరవల్లి చంద్రశేఖర్‌కు మద్దతు తెలుపుతున్న ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

స్వతంత్ర అభ్యర్థి చంద్రశేఖర్‌కు టిడిపి మద్దతు

ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎంఎల్‌సి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన వీరవల్లి చంద్రశేఖర్‌కు టిడిపి మద్దతు ఇస్తుందని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు ప్రకటించారు. వీరవల్లి చంద్రశేఖర్‌కు మద్దతుగా పార్టీల ఎంపిటిసిలతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. పంచాయతీరాజ్ ఛాంబర్ బలపర్చిన వీరవల్లికి పాలకొల్లు నియోజకవర్గానికి చెందిన 16 మంది ఎంపిటిసిలు సంపూర్ణ సహకారం అందిస్తారని నిమ్మల ప్రకటించారు. స్వతంత్ర అభ్యర్థికి కాపు మద్దతు ఉంటుందని మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్య తనకు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి, సిపిఎం, సిపిఐ మద్దతు పలికిన వీరవల్లికి జనసేన మద్దతు తెలపడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థి వీరవల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ జగన్ స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసి వాటి నిధులను కొల్లగొడుతున్నారని విమర్శించారు. తనకు మొదటి ప్రాధాన్యతా ఓటును వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తనను పోటీ నుంచి తప్పించాలని అధికార పార్టీ బెదిరింపులు, ప్రలోబాలకు లోను చేసిందని తెలిపారు. తనకు మద్దతిచ్చిన నిమ్మల రామానాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే స్థానిక సంస్థలకు చెందిన కొందరు వైసిపి నేతలే తనకు పరోక్షంగా మద్దతు పలుకుతున్నట్లు చెప్పారు.

5న చలో ఢిల్లీ జయప్రదానికి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - పెనుమంట్ర

బిజెపి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ వచ్చేనెల ఐదో తేదీన చలో ఢిల్లీని జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రమైన పెనుమంట్రలో దాట్ల ట్రస్ట్ భవనంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ మాట్లాడుతూ ఏడాది పాటు సుధీర్ఘంగా ఢిల్లీలో జరిగిన రైతాంగ పోరాటానికి స్పందించి ప్రధాని మోడీ ఇచ్చిన హామీలను నేటికీ నెరవేర్చలేదన్నారు. ఈ నేపథ్యంలో లక్షలాది మందితో చలో ఢిల్లీ చేపడుతున్నారని, రైతులు, కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. అంబానీ, ఆదానీలకు ఊడిగం చేయడం తప్ప ప్రజల కోసం, రైతుల కోసం మోడీ చేసింది శూన్యమన్నారు. దీనికితోడు సామాన్యులపై భారాలు మోపడం దారుణమన్నారు. గ్యాస్ ధరలు భారీగా పెంచేశారని, ఎరువులు, పురుగుమందుల ధరలు పెరిగిపోయాయని, రైతులకు సబ్సిడీలు తగ్గించారని, ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారుస్తున్నారన్నాని విమర్శించారు. ప్రాజెక్టులకు నిధులు నిలిపివేశారన్నారు. ఒక్కొక్కటిగా ప్రభుత్వరంగ సంస్థలను అంబానీ, అదానీలకు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ వారి చట్టాలను లేబర్ కోడ్స్‌గా మార్పు చేసి కార్మిక హక్కులను హరిస్తున్నారన్నారు. ప్రజలపై భారాల మోపి దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న మోడీని గద్దె దింపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బిజెపి వైఫల్యాలను ప్రతిగ్రామంలోనూ ఇంటింటికీ ప్రచారం చేసి కరపత్రాలు, బుక్‌లెట్లు పంపిణీ చేయాలని సమావేశం తీర్మానించింది. ఈనెల పదో తేదీ నుంచి 25వ తేదీ వరకూ ఇంటింటి ప్రచారం, 26న మోటార్ సైకిల్ ర్యాలీ, 28న జిల్లా ప్రచార యాత్రలు చేపట్టనున్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు చింతపల్లి లక్ష్మీకుమారి, పాలా నాగేశ్వరరావు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు, సిఐటియు మండల అధ్యక్షులు వాకపల్లి వెంకటరత్నం(గాంధీ), మండల కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కుడుపూడి నాగేశ్వరరావు మాట్లాడారు.



మాట్లాడుతున్న ఆకుల హరేరామ్


అవార్డు అందుకుంటున్న మురళీ కృష్ణంరాజు

మురళీ కృష్ణంరాజుకు బెస్ట్ యాక్టివ్ లయన్ అవార్డు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆకివీడులో ఆదివారం జరిగిన అంతర్జాతీయ లయన్స్ క్లబ్ 316జి జిల్లా రీజన్ నాలుగు మీట్‌లో తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు బెస్ట్ యాక్టివ్ లయన్ అవార్డు అందుకున్నారు. రీజనల్ ఛైర్ పర్సన్ లయన్ ఆర్‌విఎస్ సూర్య నారాయణరాజు అధ్యక్షతన కార్యక్రమంలో కెనరా బ్యాంక్ ఎమ్‌డి, సిఇఒ సత్యనారాయణరాజు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ లయన్ పంక జాక్సన్, లయన్ గట్టిం మాణిక్యాలరావు, లయన్ కాకర్ల వేణుబాబు, సిహెచ్ కృష్ణంరాజు పాల్గొన్నారు. బ్యానర్ ప్రజంటేషన్‌లో 3వ బహుమతి డైమండ్స్ లయన్స్ క్లబ్‌కు, ఉత్తమ క్లబ్ ప్రెసిడెంట్ అవార్డు లయన్ కోనా హనుమాన్‌కు వరించాయి. వారిని పలువురు అభినందించారు.

విన్నకోట సేవలు భేష్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ప్రెస్‌క్లబ్, ఎపియుడబ్ల్యుజె జిల్లా అధ్యక్షుడుగా, నంది అవార్డు గ్రహీతగా, రాష్ట్ర శ్రమశక్తి అవార్డు గ్రహీతగా విన్నకోట వెంకటేశ్వరరావు సమాజానికి చేసిన సేవలు వర్ధమానులకు ఆదర్శమని ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, ఐజెయు సభ్యులు డి.సోమసుందర్ చెప్పారు. పాలకొల్లులో విన్నకోట సంస్మరణ సభలో వారు మాట్లాడారు. కార్మిక, పాత్రికేయ, కళారంగానికి చేసిన సేవలను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా రామ్మోహన్ రాయ్, పట్టణ కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, ఎపిటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు నెక్కంటి సుబ్బారావు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు శివ, జిల్లా ఉపాధ్యక్షుడు పిటి వెంకటేశ్వరరావు కొనియాడారు. సంతాప సభలో ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి బాబ్జి, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, మలిరెడ్డిపల్లి సిఐ కె.శివాజీ, పలు కార్మిక, కళ, పాత్రికేయ ప్రముఖులు ఆయన సేవలను కొనియాడారు. ఆయన కుమారుడు వెంకటరమణకు సానుభూతి తెలిపారు.

సభలో పాల్గొన్న ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర జిల్లా నేతలు కార్మిక సంఘాల నేతలు

తండ్రి బాటలోనే పయనిస్తాం

సర్రాజు తనయులు శ్రీనివాసరాజు, వర్మ

ప్రజాశక్తి - కాళ్ల

తన తండ్రి మాజీ ఎంఎల్‌ఎ, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి సర్రాజు బాటలోనే పయనిస్తామని ఆయన తనయులు పాతపాటి వెంకట శ్రీనివాసరాజు, యుగంధర్ నాగ వర్మ తెలిపారు. భీమవరం ఆదర్శనగర్‌లో పాతపాటి సర్రాజు నివాసం వద్ద ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాతపాటి శ్రీనివాసరాజు, వర్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తాము వైసిపిలో ఉంటూ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సామాన్య రైతు కుటుంబం నుంచి సొసైటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎగా పనిచేసిన మహా నాయకుడని కొనియాడారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఎంఎల్‌ఎగా ఉండి నియోజకవర్గంలో అభివృద్ధి ప్రదాతగా పేరుగాంచారన్నారు. రూ.800 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి ప్రజా మన్ననలు పొందిన వ్యక్తి అని గుర్తు చేశారు. అనంతరం సర్రాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంతెన రామ్‌కుమార్ రాజు, కెవిఎస్.రాజు, పాతపాటి రామరాజు, చేకూరి చంటిరాజు, గొట్టుముక్కల తిరుపతిరాజు, వేగేశ్న సూర్యనారాయణరాజు, పాటూరి దొరబాబు, అంగర రాంబాబు, రాయి సతీష్, నిమ్మల కేశవ పాల్గొన్నారు.

ముదునూరి కుమార్తె వివాహానికి నేతల హాజరు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని గ్రామాల నుంచి ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు కుమార్తె వివాహానికి ఆదివారం నేతలు వెళ్లారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజాప్రతినిధులు ప్రత్యేక వాహనాల్లో ఏలమంచిలి మండలం కలగంపూడి సమీపంలో 216 జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన కళ్యాణ వేదిక వద్దకు తరలివెళ్లారు. జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపిరాజు వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు వెళ్లారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లి గ్రామంలోని జంలి ముత్యాలమ్మ వారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. యాత్రికులతో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి రామకృష్ణ వర్మ, ఛైర్మన్ కొల్లాటి రామారావు, సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

పాస్‌పోర్టు పోయినవి

అనపర్తి జ్ఞాన మంజరి, D/o. ప్రకాశరావు అను నేను 02-02-2023న తణుకు సూర్యాలయం వీధి నందు జెరాక్స్ గురించి వెళుతుండగా నాకు మరియు నా కుటుంబ సభ్యులకు సంబంధించిన ఒరిజినల్ పాస్ పోర్ట్‌లు పోయినవి. (నెం. **J7360368, H8376006, H8376008**). దొరికినవారు ఈ క్రింది ఫోన్ నెంబరుకి తెలుపగలరు.

సెల్: 9502955727


ప్రజలతో మాట్లాడుతున్న టిడిపి నేత రజినీకుమార్

తిల్లపూడిలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

తిల్లపూడి గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి పాముల రజినీకుమార్ పాల్గొన్నారు. ఆయన గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో పారిశుధ్య సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, డ్రెయినేజీలు అధ్వానంగా ఉన్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. అయినా ఎవరూ పట్టించుకోవడంలేదని విమర్శించారు. త్వరలోనే సైకో పాలన పోయి సైకిల్ పాలన వస్తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంటి శ్రీరాములు, అందే కోటి వీరభద్రరావు, తెలుగు యువత మండల అధ్యక్షులు నీలం తాతాజీ, దిడ్డల రామానుంజనేయులు, సెక్రటరీ బొప్పనపల్లి రంగారావు, నడపన రంగారావు ఎంపిటిసి సాగ సత్యనారాయణ పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రతి రోజూ సైక్లింగ్ చేయడం ఆరోగ్యంగా ఉంటారని పాలకోడేరు పిహెచ్‌సి వైద్యుడు డాక్టర్ రంగం నాయుడు అన్నారు. ఆదివారం పాలకోడేరు పిహెచ్‌సి పరిధిలోని గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో సైక్లింగ్‌తో వ్యాయామం కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రంగం నాయుడు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ బిజీ లైఫ్ గడపడంతో ఆరోగ్యాలు అంతంత మాత్రం గానే ఉంటున్నాయన్నారు. ఆరోగంగా ఉండాలంటే ప్రతిరోజు సైకిల్ తొక్కాలని సూచించారు. ఈ సందర్భంగా పాలకోడేరు, విస్సాకోడేరు, గొరగనమూడి, పెన్నాడ, మోగల్లు తదితర గ్రామాల్లో సైక్లింగ్‌తో వ్యాయామం కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ సత్యనారాయణ, సూపర్‌వైజర్లు శంకర్, అయ్యప్ప శ్రీనివాస్, చండీరాణి, అమ్మాజీ, నాగమణి, హెల్త్ అసిస్టెంట్లు ఎం.విజయ ప్రసాద్, శ్రీను, గోపాలకృష్ణ, సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వీస్సాకోడేరులో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎంసి డైరెక్టర్ రాంబాబుకు మాతృవియోగం

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట ఎఎంసి డైరెక్టర్, వైసిపి నాయకులు దేవిరెడ్డి రాంబాబు తల్లి దేవిరెడ్డి మంగతాయారు (75) అనారోగ్యంతో పెనుమంచిలిలో ఆదివారం మృతి చెందారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆమె పెద్ద కుమారుడు తాపీ మేస్త్రి సంవత్సరం క్రితం గుండెపోటుతో మృతి చెందారు. మంగతాయారు మృతి పట్ల సర్పంచి గణేశుల శేషవాణి సుబ్బారావు, ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, వైసిపి రాష్ట్ర కార్యదర్శి, వైట్ల కిషోర్ కుమార్, ఆచంట వేమవరం సర్పంచులు కోట సరోజినీ వెంకటేశ్వరరావు, జక్కంశెట్టి చంటి, వైసిపి నాయకులు సంతాపం తెలిపారు.

మంగతాయారు (ఫైల్‌ఫొటో)

సముద్ర కెరటాల్లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

పేరుపాలెం బీచ్ వద్ద పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు బీచ్‌కు ప్రత్యేక, ద్విచక్ర వాహనాల్లో ఉదయమే చేరుకున్నారు. సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే తోటలో సహపంక్తి భోజనాలు చేసి సేదతీరారు.

అఖండ అన్న సమారాధన

ప్రజాశక్తి - ఉండి

చెరుకువాడ గ్రామ దేవత అలుగులమ్మ వారి 104వ వార్షికోత్సవం ముగింపు సందర్భంగా ఆదివారం అఖండ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, మాజీ శాసనసభ్యులు వేటుకూరి వెంకట శివరామరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు పాల్గొన్నారు. వీరికి గ్రామ సర్పంచి కొండవీటి సాంబశివరావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ఘనస్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అన్న సమారాధనలో సుమారు 5000 మంది పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, జెడ్‌పిటిసి రణస్థల కనకదుర్గ మహంకాళి, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గవరలక్ష్మి అనిల్, నాయకులు ఇర్రింకి వెంకట సత్యనారాయణ, ఉంగరాల నాగేశ్వరరావు, కట్టా రాంబాబు, యర్రా రవి, కుచ్చు శివకృష్ణ, పడమటి త్రిమూర్తులు పాల్గొన్నారు.

పాలకొల్లు : మహాశివరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా పట్టణంలోని కొత్తపేటలో భద్రకాళీ వీరభద్రస్వామి వారి దేవస్థానంలో ఆదివారం అఖండ అన్న సమారాధన జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారు 5,000 మంది హాజరై స్వామివారి అన్న ప్రసాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు వట్టం గణేష్, మానెం బసవరాజు, ట్రెజరర్ బాసిన సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులు బాసిన గుణేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీధర్

ఆక్యుపంక్చర్ వైద్యంతో రోగాలు నయం

ప్రజాశక్తి - నరసాపురం

కొవ్వలి ఫౌండేషన్, హైదరాబాద్ కాస్మిక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపంక్చర్ ఆధ్వర్యంలో స్థానిక 7వ వార్డులో నిర్వహించిన ఆక్యుపంక్చర్ ఉచిత వైద్య శిబిరం శని, ఆదివారాల్లో విజయవంతంగా కొనసాగింది. పరిసర ప్రాంతాల నుంచి రోగులకు ఆక్యుపంక్చర్ వైద్యం ద్వారా ఆక్యుపంచరిస్ట్, కొవ్వలి ఫౌండేషన్ కార్యదర్శి కొండా శ్రీధర్ ఉపశమనం కలిగిస్తున్నారు. ఎటువంటి మందులు, ఇంజెక్షన్లు, ఆపరేషన్లు లేకుండా సన్నపాటి సూదులతో వైద్యం చేయడమే ఆక్యుపంక్చర్ వైద్యం ముఖ్య ఉద్దేశమని శ్రీధర్ తెలిపారు. ప్రతి నెలా కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగులకు ఉచిత వైద్య సేవలందిస్తానని తెలిపారు.

సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కేన్సర్‌పై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నేడు సమాజంలో కేన్సర్ రోగులు రోజురోజుకూ పెరిగిపోతున్నారని, కేన్సర్‌కు అనేక కారణాలు ఉన్నాయని వెంకట్రామన్నగూడెం పిహెచ్‌సి వైద్యాధికారి హర్ష తెలిపారు. ఆదివారం కేన్సర్‌పై అవగాహనా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మనం తినే ఆహార పదార్థాల్లో కేన్సర్ కారక మలినాలు ఉంటున్నాయన్నారు. అధిక దిగుబడి కోసం పంటలకు అధిక మోతాదులో పురుగు మందులు, ఎరువులు వాడడం, ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవరల్లో, ప్లాస్టిక్ పాత్రల్లో నిల్వ ఉంచడం, జంక్ ఫుడ్స్ ఎక్కువగా తినడం వల్ల కేన్సర్‌కు కారణం అన్నారు. మన జీవన విధానంలో మార్పు అవసరమన్నారు. అత్యవసర పరిస్థితిలో మాత్రమే బయట ఆహారం తినాలన్నారు. మనం ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యం ఉంటుందని, తద్వారా దేశం ఆర్థిక అభివృద్ధిలో ముందంజలో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఒ సత్యనారాయణ, సీనియర్ అసిసెంటంట్ నాగేశ్వరరావు, పిహెచ్‌ఎన్ విరోనిక, ఫార్మాసిస్ట్ రామారావు, హెచ్‌వి.జ్యోతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'గ్లోబల్ సమ్మిట్‌తో ఆంధ్రా రూపురేఖలు మార్పు'

ప్రజాశక్తి - ఉండి

ఒక్క గ్లోబల్ సమ్మిట్‌తో ఆంధ్ర రూప్ రేఖలు మార్చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందని జిల్లా సోషల్ మీడియా కో ఇన్‌ఛార్జి, వైసిపి యువ నాయకులు పాటూరి శ్రీనివాస దొరబాబు అన్నారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసన విలేకరుల సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ జాతీయ దిగ్గజాలందరినీ రప్పించిన ఘనత జగన్మోహన్ రెడ్డిదే అన్నారు. ఒకే ఒక్క సమ్మిట్‌తో ఆంధ్రప్రదేశ్ రూపురేఖలను మార్చేలా, భవిష్యత్‌పై భరోసా కల్గించేలా, రాజకీయ ప్రత్యర్థులు సాగిస్తున్న ప్రచారానికి తెరదించి, విశాఖ గడ్డ నుండే జగన్ విజయనాదం చేశారని తెలిపారు. ఇంతకాలం సంక్షేమ ప్రచారం, బటన్లు నొక్కుడు తప్ప పెట్టుబడులు లేవు అంటూ పరిహాసం చేసిన వారు విస్తుపోయేలా పెట్టుబడుల వర్షం వచ్చిందని తెలిపారు. 340 పెట్టుబడుల ప్రతిపాదనలు, రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు, 6 లక్షల ఉద్యోగాలు ఈ సమ్మిట్ ద్వారా సగర్వంగా ప్రకటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ప్రశంసల జల్లు కురిపించడం చాలా ఆనందకరమైన విషయమన్నారు. వ్యాపార విస్తరణకు ఎపి ఉత్తమం అంటూ దిగ్గజ కంపెనీల అధినేతలు ఎపిలో అనుకూల పరిస్థితులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమర్థతకు సర్టిఫికెట్ ఇవ్వడంపై కో ఇన్‌ఛార్జి దొరబాబు ఆనందం వ్యక్తం చేశారు.

దిశా యాప్ డౌన్‌లోడ్ చేయిస్తున్న ఎఎస్‌ఐ శ్రీనివాసరావు

దిశా యాప్ బ్రహ్మాస్త్రం : ఎఎస్‌ఐ

ప్రజాశక్తి - ఉండి

దిశా యాప్ మహిళల పాలిట బ్రహ్మాస్త్రమని ఎఎస్‌ఐ అడబాల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం చెరుకువాడ గ్రామంలో దిశా యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్‌ఐ అడబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి మహిళా తమ ఫోన్లలో దిశా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దిశా యాప్ ఆపద సమయంలో ఐదుగురు స్నేహితులకు, పోలీసులకు సమాచారం చేరవేసే విధంగా ప్రారంభించినట్లు తెలిపారు. ప్రయాణ సమయంలో ట్రాక్ మై ట్రావెల్ ఆప్షన్ ఉంటుందని దాని ద్వారా చేరాల్సిన గమ్యాన్ని ఎల్లప్పుడూ ట్రాక్ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా కాలువలో పూడికతీత

ప్రజాశక్తి - మొగల్తూరు

రామన్నపాలెంలోని సాగునీటి కాలువను ఆదివారం రైతులు స్వచ్ఛందంగా ప్రక్షాళన చేశారు. రామన్నపాలెం బ్రిడ్జ్ వద్ద కాలువలో పూడికను ఎర్రంశెట్టివారి పాలెం రైతులు సుమారు వంద మంది రైతులు తొలగించారు. దాళ్వాలో శివారు భూములకు నీరందక సుమారు 150 ఎకరాల్లో వరిచేలు ఎండిపోతున్నాయి. దీంతో రైతన్నలు పలుమార్లు ఆర్‌అండ్‌బి, ఇరిగేషన్ అధికారులతో విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో అన్నదాతల స్వచ్ఛందంగా పూడిక తొలగించారు. రైతులు ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ ఎర్రంశెట్టి బాబు, కూనపరెడ్డి సూర్యనారాయణ, కట్టా వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాలువలో పూడిక తీస్తున్న రైతులు

CHANGE OF NAME

I, **SINDHURA ISSAI**, W/o. Issai Murali Mohana Rao, D/o. Althi Siva Rama Krishna, H.No.3-15-21/1, Srirampuram, Bhimavaram, W.G District, A.P. have changed my name from **ISSAI SINDHURA** (old name) to **ALTHI SINDHURA** (new name). Hence after all my official documents, records and correspondence will be continue with my new name **ALTHI SINDHURA.**

వేలం ప్రకటన

మహారాజశ్రీ పశ్చిమగోదావరి జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి, ఏలూరు వారి కోర్టులో

E.P. (Arbn) No. 1243/2018 in

A.R.C. No. SK/SF/519/2014

Between:

M/s. Sundaram Finance Limited,
No. 21, Patullos Road, Chennai 600002,
Rep. by its Authorised signatory G.Sivarama Krishna ***...Petitioner/ D.H.R***

AND

1. Paila Satyavathi
2. Paila Nageswara Rao

...Respondent/ JDRs

పై నెంబరు గ్రంథములో డిక్రీ బాకీ రాబట్టుకునే నిమిత్తం JDR నెం. 2 పైలా నాగేశ్వరరావు గారి ఈక్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారి ఎదుట బహిరంగ వేలం వేయబడును. **ది. 21-03-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి, ఎవరైననూ వేలం పాటలో పాల్గొని స్థిరాస్తిని వేలంలో పాడుకోవచ్చును.

షెడ్యూలు ఆస్తి వివరం

The land situated in R.S. No. 137/2, in out of Ac. 0.50 cents in layout Plot No.319, 320 in an extent of 300-00 Sq.yards and 2nd item in Patta No.97 in R.S. No. 137/3 and in other Survey numbers in layout Plan of Plot No.321, in an extent 106-00 Sq.yards total extent of 406-00 Sq.Yards vacant site of Tangellamudi Village and Panchayati, Eluru Mandal, Eluru Sub-Registry, Eluru District (Old West Godavari), being bounded by:

Item No.1:
EAST: Site of Plot No's 322, 323 - 60.0 F
SOUTH: Site of 2nd item - 45 F
WEST: Road - 60 F
NORTH: Road - 45.0 F

Between the above boundaries Vacant site of an extent of 300-00 Sq. Yards.

Item No.2 in Plot No.321 an extent of 106-00 Sq.yards vacant site being bounded by:
EAST: Site of Plot No's 323 - 18.0 F
SOUTH: Site of Land of Komma Ramaswamy - 51.0 F
WEST: Road - 18.0 F
NORTH: Site of 1st Item - 55.0 F

Between the above boundaries Vacant site in and extent of 106-00 Sq. Yards. Under Two items Total extent of 406-00 Sq. Yards together with all easement rights etc.,

D.H.R. Value: Rs. 15,00,000/-
Amin Value: Rs. 25,00,000/-

B.J.REDDY
Eluru **B.A.REDDY,** Advocates
04-03-2023 Eluru, Cell:9703234999

నిర్మానుష్యంగా మారిన గాంధీ బొమ్మ సెంటర్

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి - మొగల్తూరు

వేసవి ఆరంభమైంది. మార్చి మొదటి వారంలోనే ఉష్ణోగ్రతలు రోజురోజుకూ ఎక్కువ అవుతున్నాయి. రాత్రి సమయంలో అత్యల్పంగా 20 నుంచి 21 డిగ్రీల సెంటిగ్రేట్ నమోదు అవుతుండగా ఉదయం సమయంలో అత్యల్పంగా 34 34.5 డిగ్రీలకు పెరిగింది. ఈ సంవత్సరం ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

ఘనంగా అల్లూరి జయంత్యుత్సవాలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

చింతపర్రు గ్రామంలో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విప్లవవీరుడు, తెలుగుజాతి ముద్దుబిడ్డ అల్లూరి సీతారామరాజు 125వ జయంత్యుత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ జయంత్యుత్సవాల్లో పాలకొల్లు శాసనసభ్యులు, ధర్మారావు ఫౌండేషన్ ఛైర్మన్ నిమ్మల రామానాయుడు పాల్గొని మాట్లాడారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, క్లాసికల్ డాన్స్, జానపద నృత్యాలు, గేయాలు సభికులందరిలో ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని నింపాయి. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు త్యాగం, పోరాట పటిమ భవిష్యత్ తరాలవారికి తెలియజేయాలనే ఉద్దేశంతో సంవత్సరం పొడవునా జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆయనను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ దేశానికి స్వేచ్ఛను అందించడంలో గాని, గిరిజనుల హక్కుల్ని కాపాడేవిధంలో గానీ అల్లూరి సీతారామరాజు చూపిన చొరవ గ్రామ గ్రామానికి తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, కోడి విజయభాస్కర్, మామిడిశెట్టి పెద్దిరాజు, గండేటి వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి వెంకట నరసింహారావు (బాబు), పెన్మెత్స శ్రీనివాసరాజు, రావూరి అప్పారావు, పీతల శ్రీను, సమన్వయకమిటీ సభ్యులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న విద్యార్థినులు

పురపాలక సంఘ కార్యాలయము, నరసాపురం

ఆర్.ఓ.సి. నెం. 54/2022/A1 **తేది.01-03-2023**

బహిరంగ వేలం నోటీసు

2023-2024 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించి నరసాపురం పురపాలక సంఘమునకు చెందిన రోజువారీ మార్కెట్టు, జంతువధశాలల యందు రుసుము వసూలు చేసుకొను హక్కులకు సంబంధించి బహిరంగ వేలమును ది. 16-03-2023వ తేది గురువారం ఉదయం గం॥ 11.00ల లగాయతు సదరు పాటలు పూర్తి అగు వరకూ పురపాలక సంఘ కార్యాలయము నందు శ్రీయుత కమిషనరు వారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును. వేలము నందు పాల్గొను వారు ముందుగా అందుకు సంబంధించి ధరావత్తు మరియు సాల్వెన్సీ సర్టిఫికెట్ దాఖలుపరచి పాటలందు పాల్గొనవచ్చును.

వ. నెం.	గుత్త వివరములు	వేలము సమయమునకు ముందు చెల్లించవలసిన ధరావత్తు	సాల్వెన్సీ విలువ
(1)	(2)	(3)	(4)
1.	నరసాపురం పురపాలక సంఘమునకు సంబంధించిన రోజు వారి మార్కెట్టునందు మరియు రోడ్డు మార్జినులందు ఫీజులు వసూలు చేసుకొనే హక్కు చేపల మార్కెట్‌తో సహా	రూ. 2,00,000/-	రూ. 5,00,000/-
2.	మేకల మరియు గొర్ల కబేళాల నందు ఫీజులు వసూలు చేసుకొనే హక్కు	రూ. 2,000/-	రూ. 20,000/-

షరతులు: గెజిట్ నోటిఫికేషన్ నెం. 02, తేది.10-02-2023 గల షరతులకు లోబడి సదరు వేలం పాట యందు పాల్గొనవలెను. ఇతర వివరములు ఆఫీసు పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

గమనిక: ప్రకటించిన గెజిట్ నందలి నెం.5 గల షరతు ప్రకారము సాల్వెన్సీ మరియు సంబంధిత ఆస్తికి సంబంధించి సబ్‌రిజిష్ట్రరు వారు జారీ చేసిన ఎన్‌కంబరేన్స్ సర్టిఫికెట్ (EC) నకలు జతపర్చి దాఖలు పరిచిన వారు మాత్రమే పాటలో పాల్గొనుటకు అర్హులు. పాటలో పాల్గొనుటకు సాల్వెన్సీ విలువ నగదుగా స్వీకరించబడదు. మరియు సాల్వెన్సీ సర్టిఫికెట్స్ బహిరంగ వేలం ముందు రోజు వరకూ మాత్రమే జారీ చేయబడును. బహిరంగ వేలం జరుగు రోజున సాల్వెన్సీ ధరఖాస్తు స్వీకరించబడదు.

సం/- **సిహెచ్.శ్రీనివాస్,** కమిషనరు, నరసాపురం పురపాలక సంఘం

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814